మేం బతికే ఉన్నాం..!

ప్రభుత్వ పెన్షనర్లు ఏటా తాము బతికే ఉన్నామని నిరూపించుకోవాల్సి ఉంటుంది. సాంకేతిక అందుబాటులో లేని రోజుల్లో కొత్త ఏడాది ప్రారంభంలోనే జనవరి, ఫిబ్రవరి మాసాల్లో వయోభారంతో కాగితాలు చేత పట్టుకుని వ్యయ ప్రయాసలతో ఉపఖజానా కార్యాలయం చుట్టూ తిరిగి 'జీవన ధ్రువపత్రాలు' ఇవ్వాల్సి వచ్చేది. ఇప్పుడా ఇక్కట్లకు 'జీవన్ ప్రమాణ్ యాప్' చెక్ పెట్టింది. ఈ యాప్‌లో ముఖ ఆధారితంగా పంపే వెసులుబాటు కలిగింది. దీని పుణ్యమా అని త్వరిత గతిన ఉపఖజానా కార్యాలయానికి అవసరమైన సర్టిఫికెట్‌ను ఇస్తున్నారు.

- స్మార్ట్ ఫోన్ నుంచే జీవన ధ్రువీకరణ
- లైఫ్ సర్టిఫికెట్లు అవసరం లేదు 'జీవన్ ప్రమాణ్ యాప్'తో వెసులుబాటు
- పండుటాకుల్లో ఆనందం


సత్యవేడు ఉపఖజానా కార్యాలయం

సత్యవేడు: ప్రస్తుతం స్మార్ట్ ఫోన్ నుంచే ప్రభుత్వ పింఛనుదారులు తాము ఉన్న చోటునుంచే జీవన్ ప్రమాణ్ యాప్‌లో ఫేషియల్ పంపే సౌలభ్యం కలిగింది. వయోభారం మూలాన నడవలేని స్థితిలో ఉన్న పింఛనుదారులను గుర్తించి, ఉపఖజానా కార్యాలయం సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి, జీవన్ ప్రమాణ్ పేరుతో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. వాస్తవానికి బయోమెట్రిక్, ఐరిష్ విధానాల్లో చేతి వేలి ముద్రలు అరిగిపోవడం, కంటి సమస్యలతో కొందరికి ఇబ్బందులు తప్పేవి కాదు. అవసరమైన సాంకేతికతను నవీకరిస్తున్నా సమస్యలు వెంటాడేవి. ఇప్పుడు జీవన్ ప్రమాణ్ యాప్‌తో ముఖ ఆధారిత గుర్తింపు విధానం అమలులోకి తేవడంతో పండుటాకుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

389 మంది పెన్షనర్లు

ఏటా జనవరి నెల ఒకటో తేది నుంచి ఫిబ్రవరి 28లోపు జీవన ప్రమాణ పత్రాలు ఉపఖజానా కార్యాలయానికి పెన్షనర్లు సమర్పించాల్సి వచ్చేది. సబ్ ట్రెజరీ లో సర్వీసు పెన్షన్లు, ఫ్యామిలీ పెన్షన్లు కలిపి 489 మంది ఉన్నారు. ఇప్పటికీ 359 మంది ధ్రువీకరణ పూర్తి చేసుకున్నారు. వీరందరికీ అనుమతి లభించిందని సమాచారం. కార్యాలయ పరిధిలో489 మందికి రూ. 1.82 కోట్లు పెన్షన్ ఇస్తున్నారు.


ఫేషియల్ ఫొటో తీస్తున్న ఖజానా ఉద్యోగి ఓంప్రసాద్

బెంగ తీరింది



జీవన ఆమోదం కోసం ఇప్పుడు బెంగ తీరింది. గతంలో కొత్త ఏడాది వస్తే చాలు వీటి కోసం ఎన్ని కష్టాలు పడాలో దేవుడా అని ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు కొంత కాలంగా స్మార్ట్‌ఫోన్‌తో ఈపని పూర్తి చేయడం మాకు ఎంతో నిశ్చింతగా ఉంది. ఏ ఇబ్బందీ లేదు. స్మార్ట్‌ఫోన్ వినియోగం తెలియని కొందరు ఇంట్లో పిల్లల సాయంతో పని సునాయసంగా చేయించుకోగలుగుతున్నారు.

పి. రవిబాబు, పెన్షనర్, పల్లాపువీధి, సత్యవేడు

చాలా మార్పు



జీవన ధ్రువీకరణ విషయంలో ఒకప్పటితో పోలిస్తే చాలా మార్పు వచ్చింది. అధునాతన సాంకేతికతతో వీటి ప్రక్రియ వేగం పుంజుకుంది. సత్యవేడు ఉపఖజానా పరిధిలో సత్యవేడు, నాగలాపురం, వరదయ్యపాళెం మండలాల పరిధిలో 489 మంది 74 శాతం ఆమోదం పొందారు. త్వరలో 100 శాతం పూర్తి చేస్తాం. వృద్ధులకు ఇప్పుడు ఎంతో ఊరట లభిస్తోంది.

జీఎస్.గోకులేంద్ర ప్రసాద్, ఉపఖజానా అధికారి, సత్యవేడు

క్లుప్తంగా

ఆర్టీసీ డిపోలో డీఎం తనిఖీ


కార్గో కేంద్రం వద్ద తనిఖీ చేస్తున్న డీపీటీఓ నరసింహులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆర్టీసీ డిపోను గురువారం డీపీటీఓ నరసింహులు ఆకస్మిక తనిఖీ చేశారు. డిపోలోని అద్దె బస్సులన్నింటినీ పరిశీలించారు. అనంతరం కార్గో సర్వీసు వద్ద వినియోగదారులతో మాట్లాడి సేవలు ఎలా ఉంటున్నాయో ఆరా తీశారు. రోడ్డు భద్రతా నియమాలను విధిగా పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజరు చిట్టెమ్మ, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలను నిర్వహించారు. ప్రిన్సిపల్ నాగరాజునాయుడు, వైస్ ప్రిన్సిపల్ నరసింహవర్మ మాట్లాడారు. పురుషుల్లో 14-18శాతం, మహిళల్లో 12-16 శాతం హిమోగ్లోబిన్ ఉండాలన్నారు. అంతకు మించి తగ్గితే రక్తహీనత వస్తుందన్నా రు. కార్యక్రమంలో వైద్యులు రెడ్డి రూపేష్, సు జాత, అధ్యాపకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సు డ్రైవర్లు, క్లీనర్ల యూనియన్ ఏర్పాటు


ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట మండలంలోని ప్రైవేట్ స్కూల్ బస్సుల డ్రైవర్లు, క్లీనర్ల సర్వ సభ్య సమావేశం గురువారం మంచినీళ్ల గుంట వద్ద నిర్వహించారు. మండల సీఐటీయూ సమన్వయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్, మండల సీపీఎం కార్యదర్శి ఈశ్వరమ్మ మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. వరసిద్ధి వినాయక ప్రైవేట్ స్కూల్ బస్ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ యూనియన్ అధ్యక్షుడిగా ముని చెంగల్రాయులు, ప్రధాన కార్యదర్శిగా గోపి, కోశాధికారిగా తౌశిక్ బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కాన్సేరి సెల్వరాజ్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో శేఖర్, ప్రవీణ్, మాధవయ్య, శ్రీనివాసులు, నవీన్ రెడ్డి, నాగరాజు, కుమార్ బాబు, శంకరయ్య, భాస్కర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.


ఏర్పేడు పీహెచ్‌సీ తనిఖీ


డాక్టర్లతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బాలకృష్ణ నాయక్

రేణిగుంట: ఏర్పేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా, లేదా? అని ఆరా తీశారు. మందుల కొరత ఏమైనా ఉందా? అని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య శాఖ అమలు చేస్తున్న కేంద్ర పథకాలపై డాక్టర్లతో సమీక్షించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, తరచూ వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

ఆవులను తప్పించబోయి..!

అదుపు తప్పిన పోలీసు వాహనం


అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన పోలీసు వాహనం

తిరుపతి రూరల్: ఆవులను తప్పించబోయి పోలీస్ వాహనం అదుపుతప్పడంతో సీఐ, డ్రైవర్ గాయపడిన ఘటన గురువారం తిరుపతి రూరల్ మండలంలో చోటుచేసుకుంది. వివరాలు...శ్రీకాళహస్తి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన పోలీస్ వాహనంలో సీఐ రవి నాయక్, సిబ్బందితో పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై వస్తూ ఉప్పరపల్లె వద్ద ప్రమాదానికి గురయ్యారు. హఠాత్తుగా రోడ్డుపైకి ఆవులు రావడంతో వాటిని తప్పించే ప్రయత్నంలో వాహనం అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సీఐ, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. గాయపడిన వారిని తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

భద్రతా ప్రమాణాలు పాటిస్తే ప్రమాదాల నివారణ


ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్పీ, సీఐ, సిబ్బంది

శ్రీసిటీ (వరదయ్యపాళెం): వాహనదారులు విధిగా భద్రతా ప్రమాణాలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలు నియంత్రణకు సాధ్యమని శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ డీఎస్పీ పైడేశ్వరరావు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీసిటీలోని బ్లూస్టార్ పరిశ్రమ కార్మికులతో రోడ్డు భద్రత గురించి ప్రత్యేక కార్యక్రమం, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనంలో వెళ్లే ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, అలాగే ఫోర్ వీలర్‌లో వెళ్లేవారు సీటు బెల్టు ధరించాలన్నారు. కార్యక్రమంలో సీఐ బీవీ శ్రీనివాసులు, ఎస్ఐ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాగాలమ్మ హుండీలో చోరీ

నాగలాపురం: పిచ్చాటూరు టౌనులోని టీచర్స్ కాలనీలో స్వయంభు శ్రీ నాగాలమ్మ ఆలయంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. ఆలయం గేటు తాళాలతో పాటు, ఆలయం లోపల ఉన్న రెండు హుండీను పగులకొట్టి అందులోని నగదును దోచుకెళ్లారు. గురువారం ఉదయం ఆలయానికి విచ్చేసిన భక్తులు తాళాలు పగులకొట్టి గేటు తెరిచి ఉండడం గమనించి అవాక్కయ్యారు. ఆలయ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కుష్ఠుపై అవగాహన ర్యాలీ


బీఎన్‌కండ్రిగలో ప్రతిజ్ఞ చేస్తున్న చేస్తున్న వైద్య సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: కుష్ఠు రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక వైద్యాధికారి దివాకర్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఆయన జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, టీచర్లతో కుష్ఠుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డు గల చర్మం, బత్తాయి తొక్కలాగ ఉండడం, చెవులపై, వీపుపై, ఎదపై నొప్పిలేని బొడిపెలు, కనుబొమ్మలు, కన్ను రెప్పల వెంట్రుకలు రాలిపోవడం, కాళ్లుచేతులు తిమ్మిర్లు పట్టడం..వంటి సమస్యలు ఉన్నపక్షంలో ఆరోగ్య కార్యకర్తలకు చూపించి వ్యాధి నిర్ధారణ చేసుకోవాలని కోరారు. కుష్ఠు అని తేలితే ఉచితంగా మందులు ఇస్తామన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ వైద్యులు విద్యాసాగర్, సీహెచ్‌ఓ వెంకటేశులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావును కలిసిన నూతన కార్యవర్గ సభ్యులు

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గ సంఘం ఎన్నికలు నిర్వహించారు. రాయలసీమ జిల్లాల పంచాయతీ రాజ్ సర్వీస్ అసోసియేషన్ కార్యదర్శి ఆనంద్‌బాబు అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.రజనీకాంత్, ఉపాధ్యక్షుడిగా గురవయ్య, ప్రధాన కార్యదర్శిగా మునికృష్ణ, వెంకయ్య, కార్యదర్శులుగా వెంకయ్య, రంగనాథం, ఐశ్వర్య, జాయింట్ సెక్రటరీలుగా నందిని, లోకమూర్తి, కోశాధికారిగా వెంకటసుబ్బయ్య, ముఖ్య సలహాదారుగా ఆనంద బాబు, సుబ్రమణ్యం, కార్యవర్గ సభ్యులుగా రామకృష్ణ, మురళీమోహన్, నాగరాజు, మునెమ్మ, ముని నరేష్‌కుమార్, సాయిమురళి, దక్షత, ఈశ్వరయ్యను ఎన్నుకున్నారు. అనంతరం ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావుకు అసోసియేషన్ నూతన కార్యవర్గం సమాచారాన్ని అందజేశారు.

బాపూజీ బాటలో పయనిద్దాం


ఇనగలూరులో గాంధీజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి


నారాయణవనం: నివాళ్లు అర్పిస్తున్న రాకేష్ కిరణ్ తదితరులు

రేణిగుంట: జాతిపిత మహాత్మా గాంధీ చూపిన బాటలో పయనించి సమ సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా శ్రీకాళహస్తి మండలం ఇనగలూరులో గురువారం ఆయన స్థానికులతో కలసి బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. బాపూజీ బాటలో యువత లక్ష్యాల వైపు పయనించి ప్రపంచం గర్వించే భారతావని నిర్మాణానికి తమవంతు భాగస్వామ్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చెలికం నాగరాజురెడ్డి, మనోహర్, చంద్రబాబుయాదవ్, హనుమంతు, శివకుమార్, రఘునాయుడు, శశిరాయల్, గుణ, రంగినేని చెంచయ్యనాయుడు, నక్కా పెంచలయ్య, నరేష్‌రెడ్డి, నాగభూషణ యాదవ్, ఈగల హరిబాబు రాయల్, చెంచయ్య యాదవ్ పాల్గొన్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం

శ్రీకాళహస్తి: గాంధీజీ మార్గం అనుసరణీయమని జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ కరీముల్లా అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మాగాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గాంధీజీ జీవితం ప్రపంచానికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో రేవతి, షేక్ అన్సర్, జుంలేషా, అస్లంబాషా, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

బీపీటీ కాలేజీలో..

నారాయణవనం: మండలంలోని శ్రీ సాయి బీపీటీ కళాశాలలో గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి, కళాశాల చైర్మన్ రాకేష్ కిరణ్ మాట్లాడారు. జాతిపిత గాంధీ ఆశయాలు యువతకు ఆదర్శం కావాలన్నారు. గ్రామ స్వరాజ్య సాధన కోసం గాంధీ కలలను సాకారం చేస్తూ గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చిన ఘనత వైఎస్సార్ సీపీ అధినేత జగనన్నకే దక్కిందని అన్నారు. కళాశాల ప్రిన్సిపాళ్లు దిలీప్, రమాదేవి, అల్విన్, వైఎస్సార్ సీపీ మండల వాణిజ్య విభాగ అధ్యక్షుడు అశోక్, మాజీ సర్పంచ్ పీజీ బాబు, నాయకులు గోవిందస్వామి, మంజునాథ్, ముని, వాసు, సుందరం తదితరులు పాల్గొన్నారు.

కాలేజీ బస్సు డ్రైవర్లకు అవగాహన

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): విద్యార్థుల భద్రతపై రేణిగుంట అర్బన్ ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి మండలంలోని అన్నమాచార్య, శ్రీరామ ఇంజినీరింగ్ కాలేజీలను గురువారం పరిశీలించారు. కాలేజీ బస్ డ్రైవర్లు, నిర్వాహకులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు రోడ్డుపై బస్సులు ఎక్కే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈవ్‌టీజింగ్ చేయరాదని, అలా చేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఐ అరుణ్ కుమార్ రెడ్డి

కారు ఢీ: దంపతులకు గాయాలు


మోహన్


షాలిని

నారాయణవనం: మండలంలోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని కారు ఢీకొనడంతో మోటార్ సైకిల్‌పై వెళుతున్న భార్యాభర్తలు గాయపడిన ఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ కథనం.. రేణిగుంట వినాయకనగర్‌కు చెందిన మోహన్(32), షాలిని(27) పని నిమిత్తం తమిళనాడు ఊత్తుకోటకు మోటార్‌సైకిల్‌పై వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. నారాయణవనం బైపాస్ సముదాయం క్రాస్‌వద్ద వెళ్తుండగా వీరిని ఊత్తుకోట వైపు వెళుతున్న కారు ఢీ కొని ఆగకుండా వేగంగా వెళ్లిపోయింది. ప్రమాదంలో గాయపడిన దంపతులను పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల ఇంటి బాట పట్టిన టీచర్లు

- టెన్త్‌లో మెరుగైన ఫలితాల సాధనే లక్ష్యం


తలారివెట్టులో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం, టీచర్లు


హాజరు పట్టికను పరిశీలిస్తున్న తహసీల్దార్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ హైస్కూల్లో పదవ తరగతి మెరుగైన ఫలితాల కోసం ఇంటిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్ తెలిపారు. బుధవారం రాత్రి మండలంలోని తలారివెట్టు, కల్లివెట్టు గ్రామాల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు యువశ్రీమురళి, నాదెండ్లమురళి, పీఈటీ దాసు వెళ్లారు. విద్యార్థులుచదువుతున్నారా, లేదా? అని వారి తల్లిదండ్రులను ఆరా తీశారు. అలాగే, ఆయా విద్యార్థుల విద్యా సామర్థ్యాలను తల్లిదండ్రులకు తెలిపారు. మార్చి 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి మెరుగైన ఫలితాలే లక్ష్యంగా విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించాలని టీచర్లు రాత్రి 7 నుంచి 9 గంటల వరకు విద్యార్థుల ఇళ్లను సందర్శిస్తారన్నారు.

పదిలో మెరుగైన ఫలితాలు సాధించండి

బుచ్చినాయుడుకండ్రిగ: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలో మెరుగైన ఫలితాలు సాధించాలని తహసీల్దార్ సుబ్రమణ్యం ఆకాంక్షించారు. గురువారం ఆయన ఎంఈఓలు రవీంద్రనాథ్, ముని సుబ్రమణ్యంలతో కలసి నెలవాయి జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టిక పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి మాట్లాడారు. విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చండి


సమావేశమైన అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు

రేణిగుంట: కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రేణిగుంట ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షురాలు ధనమ్మ డిమాండ్ చేశారు. రేణిగుంటలో గురువారం అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు సమావేశమయ్యారు. కనీస వేతనం రూ.36వేలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఇతర అలవెన్సులు ఇవ్వాలని, పని భారం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు భాగ్యలక్ష్మి, విజయ, పాండురంగమ్మ, గీత, లీల, పార్వతి, రేవతి పాల్గొన్నారు.

మండలానికి 29 యూనిట్లు మంజూరు


మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో స్వయం ఉపాధి పొందడానికి మొత్తం 29 యూనిట్లు మంజూరు చేశారని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. బీసీ, ఈబీసీ, రెడ్డి, కమ్మ, ఆర్య వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కులాల కార్పొరేషన్ ద్వారా 2024-25 సంవత్సరంలో సబ్సిడీపై స్వయం ఉపాధి పథకాల రుణాలను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఫిబ్రవరి 7 వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 21 నుంచి 60 ఏళ్ల లోపు వారు అర్హులని, తెల్ల రేషన్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు కలిగి ఉండాలన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాజశేఖర్లు పాల్గొన్నారు.

ధాన్యంకు గిట్టుబాటు ధర కల్పించరు

- పెట్టుబడి సాయం చేయని ప్రభుత్వం
- వడ్డీ వ్యాపారుల వద్ద అప్పుల మోత
- ఎమ్మెల్యేకు రైతుల ని'వేదన'


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం: ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని రైతులు, కూటమి నేతలు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ, వ్యవసాయశాఖ అధికారులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. గత ఏడాదితో పోల్చితే బస్తాకు రూ. 700 పైగా ధాన్యం ధర తగ్గిపోయిందని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తక్షణమే కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని పలువురు రైతులు, కూటమి నాయకులు డిమాండ్ చేశారు. అసలే వాతావరణంలో వచ్చిన మార్పులతో పంట దిగుబడి సైతం పూర్తిగా తగ్గిందని, దానికి తోడు రేటు కూడా తగ్గిపోవడంతో ఈ ఏడాది రైతుకు కోలుకోని దెబ్బ తగిలిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ప్రభుత్వం పెట్టుబడి సాయం కూడా ఇవ్వలేదని, ఈ కారణంగా వడ్డీ వ్యాపారుల వద్ద చేసిన అప్పులు తీరే పరిస్థితి కనిపించడం లేదని వాపోయారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమస్యను జిల్లా కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, నాయకులు దశరథన్, ఎంపీడీఓ ప్రసాద్, ఏఓ గౌరి తదితరులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై విహారం


హనుమంత వాహనంపై విహరిస్తున్న వీరరాఘవస్వామి


అన్న ప్రసాదాలను స్వీకరిస్తున్న భక్తులు

నారాయణవనం: స్థానిక కనకవల్లీ, వేదవల్లీ సమేత వీరరాఘవస్వామి ఆలయ వార్షిక ఉత్సవాల్లో గురువారం ఉదయం ఉత్సవమూర్తి హనుమంత వాహనంపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో 800 మందికిపైగా భక్తులకు నిర్వాహకులు అన్న ప్రసాదాల వితరణ చేశారు. సాయంత్రం చక్రస్నానంతో ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. రాత్రి ఏడు గంటలకు ఆలయ ప్రాంగణంలో ఉత్సవమూర్తులకు అర్చనలు చేసి నైవేద్యాలను సమర్పించారు. అనంతరం చక్రత్తాళ్వార్‌ను వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య గంగాళంలో మూడు సార్లు మునకలు వేయించారు. శుక్రవారం సాయంత్రం ఆలయంలో పుష్పయాగం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది.

క్రీడలూ ముఖ్యమే : ఆర్ఐఓ



విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి ఇస్తున్న ఆర్ఐఓ ప్రభాకర్‌రెడ్డి

రేణిగుంట: చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలని ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం ఏర్పేడు మండలం పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్ఐఓ మాట్లాడారు. విద్యార్థి భవిష్యత్తుకు ఇంటర్మీడియట్ కీలకమని, ఒక లక్ష్యం నిర్దేశించుకుని దాని సాధనకు పట్టుదలతో కృషి చేయాలన్నారు. ఆటలు ఆడుతూ ఉంటే చురుగ్గా ఉంటారన్నారు. అనంతరం సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నంద్యాల సుబ్బమ్మ, అధ్యాపకులు రాఘవరెడ్డి, రామాంజులు, వెంకట సురేష్, శ్రీమన్నారాయణ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.